తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 23 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

## కరెంట్ స్మార్ట్ మీటర్లతో..

# ఉచిత కరెంట్‌కు ఎగనామం

- ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలను బంద్ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- పై నుంచి కింది వరకు నాయకుల మాట ఎవరూ లెక్క చేయడం లేదు
- గాడి తప్పిన కాంగ్రెస్ పాలనతో ప్రజలు అవస్థలు

### మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి



**ప్రజావారధి/మోత్కూరు**

కాంగ్రెస్ ప్రభుత్వం మరో పథకానికి ఎగనామం పెట్టే ఆలోచన చేస్తుందని, ఇండ్లకు కరెంట్ స్మార్ట్ మీటర్లు పెట్టి ఉచిత విద్యుత్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలేమో గాని ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తుందని, ఇప్పటికే రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ లాంటి పథకాలను బంద్ పెట్టిందని, ఇప్పుడు ఉచిత విద్యుత్ పథకాన్ని నిలిపివేయడానికి కరెంట్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమైందన్నారు. కరెంట్ స్మార్ట్ మీటర్ల వంకతో రైతుల మోటార్లకు కూడా మీటర్లు పెట్టి రాష్ట్రంలో వ్యవసాయానికి కూడా ఉచిత విద్యుత్ సరఫరాను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉన్న పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలిపివేస్తుండటాన్ని తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఇండ్లకు, రైతుల మోటార్లకు మీటర్లు పెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రాష్ట్రంలో సీఎం మాట ఏ మంత్రి లెక్క చేయడం లేదని, జిల్లాల్లో మంత్రుల మాటను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే మాటలను నాయకులు లెక్క చేయడం లేదన్నారు. ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకుంటుంటే కాంగ్రెస్ పాలన రాష్ట్రంలో ఏ విధంగా ఉందో అర్థమవుతుంద న్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యేను స్వంత పార్టీ కౌన్సిలర్లే లెక్క చేయడం లేదని, నాకు కౌన్సిలర్లు సహకరించడం లేదని మున్సిపల్ చైర్మన్ అధిష్టానానికి ఫిర్యాదు చేయడం, ఎమ్మెల్యే, చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలతో మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్టీ కౌన్సిలర్లను సమన్వయం చేసుకోక పోవడం ఎమ్మెల్యే అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎమ్మెల్యే ఆధిపత్య ధోరణి అవలంభించకుండా మోత్కూరు మున్సిపాలిటీతో పాటు తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు.

# ధర్మాపురం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నా

## 10వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ నల్ల మధు యాదవ్



- కావాలనే కొందరు నాయకుల అసత్య ఆరోపణలు
- మీ బెదిరింపులకు భయపడే వాడిని కాదు
- కొన్ని పనులు స్వంత డబ్బులతో చేయించా
- పనులు, బిల్లుల డ్రాపై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురంతో పాటు 10వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని బీఆర్ఎస్ కౌన్సిలర్ నల్ల మధు యాదవ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీ స్వంత కౌన్సిలర్లే వారిని లెక్క చేయడం లేదని, చైర్మన్ అసమర్థతో ఏ పనులు చేయడం చేతగాక కొందరు నాయకులు కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చైర్మన్, ప్రభుత్వమే ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు గ్రామాభివృద్ధి గురించి ఎందుకు ఆలోచించడం లేదని, తనను ఏదో ఇబ్బంది పెట్టాలన్న ఆతృతతో, పసలేని విషయాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులకు ఫిర్యాదులు చేయడం ఎందుకని ప్రశ్నించారు. తన స్వంత డబ్బులతో గాంధీనగర్ కాలనీలో బజార్లలో కంప చెట్లు తొలగించానన్నారు. గ్రామంలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకున్నామని, ఎప్పటికప్పుడు సిబ్బందితో మాట్లాడి మురికి కాల్వలు శుభ్రం చేయిస్తున్నానని తెలిపారు. దుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చే కరెంట్ లైన్‌లో చెట్లు అడ్డంగా ఉన్న విషయంపై ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడానని, ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకుని త్వరలోనే కొట్టిస్తానని ఏఈ హామీ ఇచ్చారన్నారు. గ్రామంలో బోనాల పండుగ కోసం ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయించానని, గ్రామంలో కరెంట్ స్తంభాలన్నింటికీ లైట్లు వేయించానని, ప్రజలందరికీ కనిపిస్తున్న లైట్లు వారికి కనిపించకపోతే తానేం చేయలేనన్నారు. ధర్మాపురం గ్రామంలో బొడ్రాయి పండుగపై ఏ ఒక్కరో నిర్ణయం తీసుకుంటే సరిపోదని, గ్రామ పెద్దలతో పాటు ఊరంతా కలిసి తీసుకోవాల్సిన నిర్ణయమన్నారు. మోటార్లు చెడిపోతే కమిషనర్‌కు, సిబ్బందికి చెప్పి చేస్తున్నామని, మీ చైర్మన్‌లాగా తాను బిల్లులు డ్రా చేయడం లేదన్నారు. బిల్లుల డ్రాపై అసత్య ఆరోపణలు చేస్తున్న నాయకులు దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ నాయకులు కొందరు తనను భయపెట్టాలని చూస్తే భయపడే వాడిని కాదని, ప్రతిపక్షంలో ఉన్నా గ్రామాభివృద్ధిలో ఏ మాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, తన శాయశక్తులా గ్రామాభివృద్ధితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా పని చేస్తానన్నారు.